అభివృద్ధి పథంలో.. పీయూ

- పాలమూరు యూనివర్సిటీలో త్వరలో లా, ఇంజనీరింగ్ కళాశాలలకు శంకుస్థాపన
- ముఖ్య అతిథిగా హాజరు కానున్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఇటీవల పనులను పరిశీలించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- ప్రజా ప్రతినిధులకు సమస్యలు తెలిపా : వీసీ శ్రీనివాస్ 7



పాలమూరు యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ బ్లాక్

పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధిలో బాటలో అడుగులు వేస్తోంది. వర్సిటీకి లా, ఇంజనీరింగ్ కళాశాలలు మంజూరు కావడంతో పాటు అందుకు అవసరమైన నిధులు మంజూరునకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్' ద్వారా రూ.100 కోట్లు మంజూరు చేయగా, పలు నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మరోవైపు పీఎం అజయ్ ప్రాజెక్టులో భాగంగా హాస్టళ్ల నిర్మాణానికి రూ.14 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంచగా, నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ లభించిందని అధికారులు చెబుతున్నారు. బోధన, బోధనేతర పోస్టులు భర్తీ కానున్నాయని అంటున్నారు.

- పాలమూరు యూనివర్సిటీ (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్


డాక్టర్ రాంకిషన్

4 నుంచి రెగ్యులర్ తరగతులు

- విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాం 6
- 'ఆంధ్రజ్యోతి'తో నారాయణపేట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకిషన్

నారాయణపేట మెడికల్ కళాశాలలో ఫౌండేషన్ కోర్సు ప్రారంభమైందని, ఈ నెల నాల్గో తేదీ నుంచి విద్యార్థులకు రెగ్యులర్ తరగతులు ప్రారంభం అవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకిషన్ తెలిపారు. కళాశాల 97 పోస్టులు మంజూరు కాగా, 32 మంది విధుల్లో చేరారని చెప్పారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

సర్వే పకడ్బందీగా సాగాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్


నాచారం గ్రామంలో సర్వే ఫారం రాస్తున్న విధానాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కోస్గి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తలపెట్టిన కులగణన కుటుంబ సర్వే పకడ్బందీగా సాగాలని నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కోస్గి మండలం నాచారం గ్రామంలో కుటుంబ సర్వేను ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. సర్వే ఏవిధంగా చేపడుతున్నారు, కులగణన ధ్రువపత్రాలు ఎలా రాస్తున్నారన్న వివరాలు ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా కూడా తప్పులు దొర్లకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 15లోగా కులగణన సర్వే చేయడం పూర్తి కావాలని, 30వ తేదీలోగా పూర్తి స్థాయిలో ప్రభుత్వానికి నివేదిక అందజేయాలన్నారు. ఆ దిశగా మండల అధికారులు, సర్వే బృందాలు చర్యలు చేపట్టాలన్నారు. సర్వే వివరాల నమోదులో ఎవరు నిర్లక్ష్యం వహించినా సహించేది లేదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శ్రీధర్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు రావాలని.. సీఎంకు ఆహ్వానం

- హైదరాబాద్‌లో పత్రికను అందించిన దేవరకద్ర, మక్తల్ ఎమ్మెల్యేలు


సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను ఇస్తున్న ఎమ్మెల్యేలు జీఎంఆర్, వాకిటి శ్రీహరి తదితరులు

చిన్నచింతకుంట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవం, పేదల తిరుపతిగా విరాజిల్లుతున్న కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని ఆహ్వానించినట్లు దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఆహ్వాన పత్రికను ముఖ్యమంత్రికి అందించి, ఆహ్వానించినట్లు తెలిపారు. వచ్చేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేసినట్లు చెప్పారు. ఎనిమిదో తేదీనే వస్తానని సీఎం అంటే, ఆ రోజు ఉద్దాలోత్సవం ఉంటుందని, భక్తులు లక్షల సంఖ్యలో హాజరు కానున్న నేపథ్యంలో పోలీసు భద్రత దృష్ట్యా మరో రోజు రావాలని కోరినట్లు చెప్పారు. అందుకు సీఎం తేదీని ఖరారు చేయండని, తప్పక వస్తానని చెప్పారని అన్నారు. కార్యక్రమంలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు భాస్కర్, గూడూరు వెంకటయ్య పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీకొని ఇద్దరు యువకుల మృతి

- మహబూబ్‌నగర్ జిల్లా సల్కర్‌పేట్ వద్ద ఘటన

గండీడ్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రెండు బైకులు ఢీకొని ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల పరిధిలోని సల్కర్‌పేట్ గ్రామ సమీపంలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ శేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం సాయంత్రం మండల పరిధిలోని కొండాపూర్ గ్రామానికి చెందిన బోరు రవీందర్ (19) తన తండ్రి మైబయ్యను తీసుకొచ్చేందుకు కొండాపూర్ గ్రామం నుంచి సల్కర్‌పేట్ గ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. మార్గం మధ్యలో కుల్కచర్ల మండలం పటేల్ చెరువు తండాకు చెందిన రవి నాయక్ (30) గండీడ్ మండలం పంచలింగాల తండకు బంధువుల దగ్గరకు బైక్‌పై వస్తుండగా రెండు బైకులు ఎదురెదురుగా వేగంగా ఢీకొన్నాయి. దీంతో ఆ ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడు బోరు రవీందర్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనతో కొండాపూర్‌లో గ్రామంలో పండుగనాడు విషాదం నెలకొన్నది. గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు.


రవీందర్, రవి నాయక్(ఫైల్)

ఖోఖో విజేతలు నారాయణపేట, నాగర్‌కర్నూల్


పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో అధికారులు, నాయకులు

కోయిలకొండ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అండర్ 14 ఖోఖో పోటీల్లో బాలుర విభాగంలో నారాయణపేట, బాలికల విభాగంలో నాగర్‌కర్నూల్ జిల్లా విజేతగా నిలిచాయి. శుక్రవారం నారాయణపేట జిల్లా కోయిలకొండ మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించారు. 10 జట్లు పాల్గొన్నాయి. బాలుర విభాగంలో నారాయణపేట జిల్లా విజేతగా నిలువగా, మహబూబ్‌నగర్ ద్వితీయ, నాగర్‌కర్నూల్ తృతీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో నాగర్‌కర్నూల్ ప్రథమ స్థానంలో నిలువగా, నారాయణపేట ద్వితీయ, మహబూబ్‌నగర్ తృతీయ స్థానంలో నిలిచాయి. కార్యక్రమంలో ఎంపీడీవో కాళప్ప, ఎంఈవో వెంకట్‌జీ, నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, కృష్ణయ్య, రవీందర్, విద్యాసాగర్‌గౌడ్, యాదవ్‌కుమార్, పీఈటీ మొగులాల్ పాల్గొన్నారు.


కొడుకుతో విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటస్వామి దంపతులు

ఆ కుటుంబంలో అందరూ ఉపాధ్యాయులే

తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తున్న సంతానం
విద్యాబోధనే వృత్తిగా స్వీకారం
అదే వృత్తిలో జీవిత భాగస్వాములు
6



కురుమూర్తి రాయుడికి పట్టు వస్త్రాలు 7

- ఉపవాస దీక్షతో సిద్ధం చేస్తున్న అమరచింత చేనేత కార్మికులు

వెలిగిపోయిన నారాయణపేట

- జిల్లాలో ఘనంగా దీపావళి వేడుకలు

దీపావళి పండుగను జిల్లా ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. వాడ వాడలా బాణసంచా శబ్దాలు మారుమోగాయి. పిల్లలు, పెద్దలూ అందరూ కలిసి ఆనందోత్సాహాల మధ్య వేడుకలను నిర్వహించుకున్నారు. ఉదయం పూజలు చేసి, స్వీట్లు ఆరగించిన జనం.. సాయంత్రం కాగానే ఇళ్లను దీపాలతో ముంచెత్తారు. ఆ తర్వాత బాణసంచా కాలుస్తూ ఆనందం వ్యక్తం చేశారు. టపాసుల ధరలు పెరిగినా కొనుగోలు చేసి, మోత మోగించారు.

- నారాయణపేట/మక్తల్ రూరల్/కొత్తపల్లి


పేటలో దీపావళి వేడుకల్లో ఎస్పీ దంపతులు


పేటలోని ఓ ఇంటి ముందు వేసిన ముగ్గులో దీపాలు పెడుతున్న మహిళలు, యువతులు



పేట, మక్తల్‌లలో బాణసంచా కాల్చుతున్న చిన్నారులు


భూచక్రం కాల్చుతున్న చిన్నారి

మాఫియా వలలో కృష్ణానది

కృష్ణానదిలో ఆంధ్ర జాలర్లు అలివి వలల వేయడం ద్వారా భవిష్యత్తులో మత్స్య సంపద అంతరించి పోయే ప్రమాదం ఉందని స్థానిక మత్స్యకారులు వాపోతున్నారు. ఈ వలలకు చిన్న చిన్న చేప పిల్లలు కూడా చిక్కడంతో తమకు ఉపాధి అవకాశం లేకుండా అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్ర దళారులకు స్థానిక నాయకులు మద్దతు ఉండటంతో విచ్చలవిడిగా అలివి వలలు వినియోగిస్తున్నారని అంటున్నారు. విషయాన్ని అధికారులకు విన్నవించినా చూసీచూడనట్లు వదిలేస్తున్నారని, ఇప్పటికే కొన్ని రకాల చేపలు నదిలో లభించడం లేదని వాపోతున్నారు.

- నదిలో నిషేధిత అలివి వలలను వినియోగిస్తున్న ఆంధ్రా జాలర్లు
- సహకరిస్తున్న స్థానిక నాయకులు, దళారులు
- ఉపాధి కోల్పోతున్నామని స్థానిక మత్స్యకారుల ఆవేదన
- అంతరించిపోతున్న కొన్ని రకాల చేపలు
- ఉన్నతాధికారులు స్పందించాలంటున్న స్థానికులు

పెంట్లవెల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అలివి వలలతో మత్స్య సంపద అంతరించి పోయేలా ఉందని స్థానిక మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొందరు దళారులు స్థానిక నాయకుల మద్దతుతో నిషేధిత అలివి వలలను కృష్ణా నదిలో వినియోగిస్తున్నారు. దీంతో చిన్నచిన్న చేప పిల్లలు కూడా ఈ వలలో చిక్కడంతో కొన్ని రకాల చేపలు నదిలో కనిపించడం లేదని స్థానిక మత్స్యకారులు వాపోతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గం పెంట్లవెల్లి మండలంలోని జటప్రోలు, మల్లేశ్వరం, మంచాలకట్ట, వెముకల్, కొల్లాపూర్ మండలంలోని సోమశిల, అమరగిరి గ్రామాలకు అనుకొని నల్లమల్ల కొండల మధ్య కృష్ణానది ప్రవహిస్తుంది. ఈ కృష్ణానది తీరం వెంట కొన్ని వందల మంది మత్స్యకారులు చేపలు పడుతూ జీవనం సాగిస్తుంటారు. కానీ ఇక్కడ మత్స్య సంపదపై ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దళారుల కన్ను పడింది. స్థానిక దళారులతో కలిసి కృష్ణానదిలో పట్టు (స్థలం) కొనుగోలు చేస్తున్నారు. ఒక్కొక్క పట్టు ధర రూ.5లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంటుంది. వీరు కొనుగోలు చేసిన స్థలంలో

మిగతా 6వ పేజీలో..


కృష్ణానదిలో మల్లేశ్వరం వద్ద అలివి వలల ద్వారా చేపలు పడుతున్న మత్స్యకారులు


కృష్ణానదిలో మంచాలకట్ట వద్ద వేసిన అలివి వలకు చిక్కిన సన్న చేప పిల్లలు

తప్పిదాలకు తావివ్వొద్దు

- సర్వేపై కలెక్టర్ విజయేందిర బోయి


శేరిపల్లిలో సర్వే అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

భూత్పూర్/మూసాపేట, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ఈ నెల 6వ తేదీ చేపట్టనున్న సమగ్ర ఇంటింటి, కుటుంబ సర్వేలను పక్కాగా నిర్వహించాలని ఎన్యుమరేటర్లు, అధికారులను కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. శుక్రవారం భూత్పూర్ మండలంలోని శేరిపల్లి, మునిసిపాలిటీలోని 9వ వార్డు, మూసాపేట మండలం పోల్కంపల్లిలో ఇంటింటి సర్వే నివాస ప్రాంతాల్లో ఇళ్ల జాబితాల రూపకల్పనను కలెక్టర్ ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అధికారులు ఇళ్లకు స్టిక్కర్లు అతికించగా, వాటిపై నమోదు చేసిన వివరాలను కలెక్టర్ పరిశీలించారు. ఏ ఒక్క గృహాన్నీ వదలకుండా సర్వే చేయాలని చెప్పారు. మూడు రోజుల్లో ఇళ్ల లిస్టు పూర్తి చేయాలని చెప్పారు.

న్యూస్ బాక్స్

నేటి నుంచి 30 పోలీసు చట్టం

మహబూబ్‌నగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాలమూరు జిల్లాలో నేడు శనివారం నుంచి డిసెంబరు ఒకటో తేదీ వరకు 30 రోజుల పాటు 30 పోలీసు చట్టం అమలులో ఉంటుందని ఎస్పీ జానకి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుమతిలేనిదే ఎవరూ సభలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించకూడదని పేర్కొన్నారు. సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా ఉన్నతాధికారుల నుంచి అనుమతి లేకుండా ఎలాంటి పబ్లిక్ మీటింగ్‌లు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించొద్దని తెలిపారు. నిషేధిత ఆయుధాలు అయిన కత్తులు, చాకులు, కర్రలు, జెండాలు, లావు కర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, నేరాలకు పురిగొల్పేలా ఆయుధాలను వాడొద్దని, లౌడ్ స్పీకర్లు, డీజేలను ఉపయోగించొద్దని చెప్పారు. ఉల్లంఘిస్తే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.


జడ్చర్ల పట్టణంలోని సరస్వతీ నగర్ ఇంట్లో చిందరవందరగా పడిన దుస్తులు

జడ్చర్ల పట్టణంలోని రెండు ఇళ్లలో చోరీ

జడ్చర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల పట్టణం సరస్వతి నగర్ కాలనీలోని రెండు ఇళ్లల్లో చోరీ జరిగింది. కాలనీలో నివాసం ఉంటున్న పవన్ తన స్వగ్రామమైన గంగాపురానికి దీపావళి పండుగ కోసం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. సీసీ కెమెరాల ద్వారా ఇంటి పరిసరాలను గురువారం అర్ధరాత్రి వరకు మొబైల్ యాప్‌లో పరిశీలించాడు. అర్ధరాత్రి అనంతరం దొంగలు తాళం విరగ్గొట్టి, ఇంట్లోని కప్‌బోర్డులలో దాచిన 12 తులాల బంగారు, అర కిలో వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. అలాగే అదే కాలనీలో నివాసం ఉంటున్న మహేశ్వర్‌రెడ్డి కూడా ఇంటికి తాళం వేసి, పండుగకు సొంత ఊరికి వెళ్లాడు. అర్ధరాత్రి అనంతరం మహేశ్వర్‌రెడ్డి ఇంటి తాళం విరగ్గొట్టి, ఇంట్లో దాచిన రెండున్నర తులాల బంగారం, 30 తులాల వెండి వస్తువులతో పాటు కొంత నగదు చోరీ అయ్యింది. సీఐ ఆదిరెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి, క్లూస్ టీంతో విచారణ చేపట్టారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆ కుటుంబంలో.. అందరూ ఉపాధ్యాయులే

● తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తున్న సంతానం
● విద్యాబోధనే వృత్తిగా స్వీకారం
● అదే వృత్తిలో జీవిత భాగస్వాములు


పెళ్లి వేడుకల్లో విశ్రాంత ఉపాధ్యాయుని కూతుళ్లు, అల్లుళ్లు(ఫైల్)

ఉండవల్లి, నవంబరు 1 : బాలబాలికలకు విద్యాబుద్ధులు నేర్పించడమే లక్ష్యంగా ఉపాధ్యాయుడిగా పని చేసిన ఆయన తన కుమారుడు, కుమార్తెలను కూడా విద్యారంగంలో ప్రోత్సహించారు. ఆయనే జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఎన్.వెంకటస్వామి. ఆయన స్ఫూర్తి, ప్రోత్సాహంతో సంతానం కూడా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టడమే కాకుండా, అదే వృత్తిలో ఉన్న వారినే భాగస్వాములుగా ఎంచుకున్నారు. ఇలా ఆ కుటుంబంలో మొత్తం తొమ్మిది మంది విద్యాబోధనే వృత్తిగా జీవనం సాగిస్తున్నారు. ఉండవల్లి మండలంలోని లింగనావాయికి చెందిన మధ్య తరగతి రైతు ఎన్.నర్సింహులు, గౌరమ్మ దంపతులకు ఆరుగురు సంతానం ఉన్నారు. వారిలో రెండవ కుమారుడు ఎన్.వెంకటస్వామి అలంపూర్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. గద్వాల ప్రభుత్వ కళాశాలలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. మహబూబ్‌నగర్‌లో బీఈడీ చేశారు. 1948లో ఉపాధ్యాయుడిగా మానవపాడు పాఠశాలలో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత ఉండవల్లి, వల్లూరు, గట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోషల్, ఇంగ్లీష్ సబ్జెక్టులు బోధించాడు. 39 సంవత్సరాల పాటు విధులు నిర్వహించి ఉండవల్లి జడ్పీహెచ్ఎ‌స్‌లో 1998లో ఉద్యోగ విరమణ చేసి, అక్కడే స్థిరపడ్డారు. వెంకటస్వామి, రాజేశ్వరి దంపతులకు ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వారిలో పెద్ద కుమార్తె పద్మావతమ్మ మినహా మిగతా వారందరూ ఉపాధ్యాయ వృత్తినే ఎంచుకున్నారు. ఇదే వృత్తిలో కొనసాగుతున్న వారినే తమ భాగస్వాములుగా ఎంచుకున్నారు.

గర్వపడుతున్నా..

నాడు బతకలేక పడిపంతుల ఉద్యోగం అనే నానుడి ఎక్కువగా ఉండేది. ఆ కాలానికి తగ్గట్టు అది నిజమేనని అనిపించేది. బతకలేక కాదు ఏలా బతకాలో నేర్పితే తల్లిదండ్రులతో పాటు, సమాజం కూడా గౌరవిస్తుందనే ప్రగాఢంగా విశ్వసించిన నేను, నా పిల్లలకూ అదే నేర్పించాను. సమాజంలో గురువు స్థానం ఎప్పుడూ పదిలమే. అటువంటి ఉపాధ్యాయ వృత్తిలో నా కుటుంబం ఉన్నందుకు చాలా గర్వపడుతున్నా.
- ఎన్.వెంకటస్వామి, విశ్రాంత ఉపాధ్యాయుడు, ఉండవల్లి

కుటుంబ సభ్యుల వివరాలు..

- ఎన్. వెంకటస్వామి, (విశ్రాంత ఉపాధ్యాయుడు), భార్య రాజేశ్వరి (గృహిణి).
- కుమారుడు బీఎన్ వేణుగోపాల్, ఎంఏ బీఈడీ, ఎస్ఏ, ఇంగ్లీష్, జడ్పీహెచ్ఎస్, మానవపాడు, కోడలు సంధ్యారాణి, ఎంఏ బీఈడీ, మ్యూజిక్ టీచర్, ఎంజేపీ(గర్ల్స్), పుల్లూరు.
- పెద్ద కుమార్తె ఎన్.పద్మావతమ్మ, (గృహిణి), అల్లుడు ఎం.నాగరాజు, ఎంఏ బీఈడీ, విశ్రాం ప్రధానోపాధ్యాయుడు (ఎల్ఎఫ్ఎల్)
- రెండవ కుమార్తె బీఎన్. అనురాధ, ఎంఏ బీఈడీ, సోషల్, కేజీబీవీ, పెబ్బేరు, వనపర్తి జిల్లా, అల్లుడు ఏ. వెంకట ప్రసాద్, పీహెచ్‌డీ, ఎంఏ, ఎంఫిల్, ఆధ్యాపకుడు, పెబ్బేరు డిగ్రీ కళాశాల, వనపర్తి జిల్లా.
- మూడవ కుమార్తె బీఎన్ అరుణాదేవి, ఎంఏ, బీఈడీ, ఎస్ఏ, అలంపూర్ గర్ల్స్ హైస్కూల్, అల్లుడు ఎం. శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్, గవర్నమెంట్ ప్రెస్, కర్నూలు
- నాలుగవ కుమార్తె బీఎన్. పార్వతమ్మ, ఎంఏ బీఈడీ, ఏస్ఏ తెలుగు, జడ్పీహెచ్ఎస్ రాజోళి, అల్లుడు సుధాకర్, ఎంఏ బీఈడీ, ఎస్ఏ తెలుగు, జడ్పీహెచ్ఎస్ క్యాతూరు.

4 నుంచి రెగ్యులర్ తరగతులు

● ప్రారంభమైన ఫౌండేషన్ కోర్సు
● విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాం
● డాక్టర్లు, ప్రొఫెసర్ల కొరత ఉంది
● నారాయణపేట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కిషన్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

నారాయణపేట, నవంబరు1: (ఆంధ్రజ్యోతి): నారాయణపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను గత అక్టోబరు 24 నుంచి ఫౌండేషన్ కోర్సు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రాంకిషన్ తెలిపారు. ఈ నెల నాల్గో తేదీ నుంచి రెగ్యులర్ తరగతులు ప్రారంభం అవుతాయని చెప్పారు. మెడికల్ కళాశాలలో శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

విద్యార్థులకు ఏమేం వసతులు సమకూర్చారు?

విద్యార్థులకు ప్రభుత్వపరంగా అన్ని వసతులు కల్పించేలా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి చర్యలు తీసుకున్నారు. హాస్టల్ వసతితో పాటు భోజన వసతి కల్పించాము. కళాశాల ఉన్న అప్పక్‌పల్లికి వచ్చేందుకు నారాయణపేట నుంచి బస్సు సౌకర్యం కల్పించాం.

కళాశాలకు ఎన్ని పోస్టులు మంజూరయ్యాయి? ఎంత మంది వచ్చారు?

97 పోస్టులకు గాను 32 మంది విధుల్లో చేరారు. ఇంకా చేరేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా ప్రొఫెసర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ కొరత ఉంది. ఇప్పటి వరకు ఎనిమిది మందే ప్రొఫెసర్స్ ఉన్నారు.

ఖాళీగా ఉన్న విభాగాలేంటి?

మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్, సోషల్ అండ్ ప్రివెంటివ్ విభాగాలకు ఒక్క ప్రొఫెసరూ లేరు. జనరల్ మెడిసిన్‌లో కూడా ఎవరూ లేరు. ఒకరు ఎస్ఆర్‌గా జాయిన్ అయ్యి, సెలవులు లేకపోయినా లాంగ్ లీవ్ పెట్టి వెళ్లారు. అతను వచ్చే సూచనలు లేవు. పేషెంట్లు అధికంగా ఉన్న జనరల్ మెడిసిన్‌లో ఒక్క డాక్టర్ కూడా అందుబాటులో లేరు. చిన్న పిల్లలకు సంబంధించి ఒక అసిస్టెంట్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్లు ఉన్నారు. గైనకాలజీలో కూడా రెగ్యులర్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు లేరు. కాంట్రాక్టు పద్ధతిన ఒకరిని తీసుకున్నాం. అసోసియేట్ ప్రొఫెసర్ లేరు. ఆర్థోపెడిక్ విభాగంలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్లు లేరు. ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు.


నారాయణపేట మెడికల్ కళాశాల

ఎంబీబీఎస్ డాక్టర్ల కొరత అధికంగా ఉంది కదా.. ఎలా మేనేజ్ చేస్తున్నారు.

క్యాజువాలిటీని నడిపేందుకు ఎంబీబీఎస్ డాక్టర్లు నలుగురు ఉన్నారు. ఆస్పత్రి నడిపేందుకు ఆర్ఎంవోలు ఆరుగురు అవసరం ఉండగా.. ఒక్కరూ లేరు. డాక్టర్ల కొరత తీవ్రంగా ఉంది.

ప్రొఫెసర్లు ఇక్కడికి రాకపోవడానికి గల కారణం?

హైదరాబాద్‌తో పోల్చుకుంటే ఇక్కడ పని చేసే ప్రొఫెసర్లకు జీతం రూ.25 వేల తేడా ఉంది. అసోసియేట్ ప్రొఫెసర్లకు రూ.15 వేల తేడా ఉంది. హెచ్ఆర్ఏ హైదరాబాద్‌లో 28 శాతం వస్తే.. ఇక్కడ పని చేసేవారికి తొమ్మిది శాతం వస్తుంది. దూరం ఉండటం, జీతం తగ్గడం వల్ల ఇక్కడ పని చేసేందుకు ప్రొఫెసర్లు ఆసక్తి చూపడం లేదు. ఈ విషయాన్ని మంత్రి, ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లాము.

ఎన్ని సీట్లకు అనుమతి లభించింది?

మెడికల్ కళాశాలలో 50 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతి లభించింది. ప్రతీ సంవత్సరం 50 మంది విద్యార్థులను పెంచుతూ తీసుకుంటాము.


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఖోఖో పోటీలకు నిడ్జింత విద్యార్థి ఎంపిక

కొత్తపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలం నిడ్జింత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి నాగమల్లేష్ ఉమ్మడి జిల్లా ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు. ఇంతకుముందు నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో గెలుపొందిన నాగమల్లేష్ మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. విద్యార్థి ఎంపికపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు.


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి

రాష్ట్ర స్థాయి పోటీలకు కొండాపూర్ విద్యార్థి

ధన్వాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ధన్వాడ మండలం కొండాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థి సిద్ధార్థ రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం నుంచి ఈనెల ఆరో తేదీ వరకు మహబూబాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి పాల్గొంటాడని కోచ్ రాంమోహన్‌గౌడ్ తెలిపారు. విద్యార్థి ఎంపికపై పాఠశాల ప్రిన్సిపాల్ రాజారాం, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సాంబయ్యనాయక్, పీఈటీ ఆంజనేయులు అభినందించారు.

ఉద్యమిస్తేనే సమస్యలు పరిష్కారం

● తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతరావు

మరికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం ఉద్యమాలతోనే సాధ్యమని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావు అన్నారు. మరికల్ మండల వనరుల కేంద్రంలో జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులకు పీఆర్సీ, డీఏ తదితర సమస్యలు పరిష్కారం కావాలంటే కచ్చితంగా ఉద్యమ బాట పట్టాల్సిందేననే ఉద్దేశంతో పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యమ కార్యాచరణ ప్రకటించడం జరిగిందన్నారు. 317 బాధితులకు న్యాయం చేయాలని, పాత పెన్షన్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నవంబరు ఐదున జిల్లా స్థాయిలో దీక్ష, 23న రాష్ట్ర స్థాయిలో ఇందిరా పార్కు వద్ద ధర్మాగ్రహ దీక్ష నిర్వహించనున్నామని తెలిపారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, నరసింహ, సురేష్‌కుమార్, శివశంకర్, సురేష్ బాబు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెద్దకొత్తపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులతో కలిసి బైక్‌పై వెళ్తుండగా ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి క్రింద పడడంతో తీవ్ర గాయాలకు గురై చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్ద కొత్తపల్లి మండలం పెద్ద కార్వాముల గ్రామానికి చెందిన కల్మూరి ఎల్లస్వామి కుమారుడు కల్మూరి ప్రణయ్‌దీప్ (19) అతని స్నేహితులైన చొప్పరి శ్రీశైలం, బుడుగు వీరయ్య అలియాస్ వీరేష్ పని నిమిత్తం చిన్న కార్వాముల నుంచి చిన్నకొత్తపల్లి గ్రామానికి బైకుపై బుధవారం వెళ్తున్నారు. మార్గ మధ్యలో చిన్నకార్వాముల శివారులో బుడుగు శ్రీశైలం పొలం దగ్గర బైక్ అదుపు తప్పి కింద పడడంతో ప్రణయ్ దీప్ తలకు, మెడకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రణయ్‌దీప్ గురువారం రాత్రి మృతి చెందాడు. వీరేష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. మృతుని తండ్రి కల్మూరి ఎల్లస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సతీష్ తెలిపారు.


మృతి చెందిన ప్రణయ్‌దీప్ (ఫైల్)

పంట కాలువలో పడి బాలుడి మృతి

అయిజ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పంట కాలువలో పడి సందీప్ (11) అనే బాలుడు మృతి చెందిన ఘటన గురువారం మధ్యాహ్నం జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని తూముకుంట గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన రవి, శశికళ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా రెండో కుమారుడు సందీప్. నాగర్‌దొడ్డి రిజర్వాయర్ నుంచి పంట కాలువ తూముకుంట గ్రామ సమీపంలో నుంచి వెళతుంది. స్థానిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న సందీప్ చిన్న పిల్లలతో కలిసి కాలువ సమీపంలోకి వెళ్లారు. ప్రమాదవశాత్తు కాలువలో పడ్డాడు. కాలువ నీరు నిండుగా ప్రవహిస్తుండటంతో అందులో మునిగిపోయాడు. అది గమనించిన తోటి చిన్నారులు ఇంటికి వచ్చి సమాచారం ఇచ్చారు. కుటుంబీకులు వెళ్ళి కాలువలో చూడగా నీటిలో మునిగి ఊపిరిఆడక మృతి చెందాడు. మృతదేహానికి శుక్రవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

మాఫియా వలలో కృష్ణానది

(మొదటి పేజీ తరువాయి...)

సుమారు ఐదు నెలలు చేపలు పట్టుకునేందుకు వీలుంటుంది. నీటి నిల్వను బట్టి పట్టులకు డిమాండ్ ఉంటుంది. ఆంధ్ర దళారులతో స్థానిక నాయకులు ముందుగానే 25 శాతం డబ్బులు తీసుకొని సీజన్ ముగిసే వరకు డబ్బులు చెల్లించే విధంగా ఒప్పందం కుదుర్చుకుంటారు. ప్రతీ సంవత్సరం నవంబరు, డిసెంబరు నెలలో ఆంధ్ర రాష్ట్రమైన కొవ్వూరు, రాజమండ్రి, తూర్పు గోదావరి తదితర ప్రాంతాల నుంచి జాలరులను పిలిపిస్తారు. ఒక్కొక్క వలకు పది మంది చొప్పున వచ్చి అలివి వలతో పాటు ఇతర వలలు వేస్తారు. ఈ వలలకు చిన్న సైజు గుడ్డుతో సహా పెద్ద సైజు చేపలు పడుతాయి. ముఖ్యంగా నదిలో దొరికే చేపలు బొచ్చ రకం చేప, రవ్వ, కొర్రమీను, వాల్గా, కొవ్వుజల్లు, బొమ్మిడాలు, రొయ్యలు, నారజల్ల, జిలేబిల వంటి రకాల చేపలు పడుతుంటారు. వీటిని సమీపంలోని నది ఒడ్డునే ఒక కవరు ఏర్పాటు చేసుకొని విడివిడిగా ఆరబోస్తారు. ఒక్కొక్క రకం చేపకు ఒక ధర పలుకుతోందని జాలర్లు చెబుతున్నారు. రాత్రి పగలు అని తేడా లేకుండా కృష్ణానదిలో వలలు వేసి చేపలు పడుతారు. ఈ ఆంధ్రా దళారి దందాకు స్థానిక రాజకీయ నాయకుల అండదండలు ఉండటంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగుతోంది. అలాగే గతంలో కూడా ఎన్నో సార్లు మత్స్యశాఖ అధికారులకు స్థానిక గ్రామాల ప్రజలు ఈ సమస్యపై వినతి పత్రం ఇచ్చినా నామమాత్రపు దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.


మల్లేశ్వరం వద్ద అలివి వలను బోటుకు ఎత్తుతున్న మత్స్యకారులు


కృష్ణానది తీరంలో మల్లేశ్వరం వద్ద ఆంధ్ర మత్స్యకారులు ఏర్పాటు చేసుకున్న గుడారాలు

వృద్ధి చెందక ముందే పడుతున్నారు

మత్స్యకారులను ప్రభుత్వం ఆర్థికంగా బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోంది. చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, నదులలో కోట్లాది రూపాయాల విలువ చేసే చేప పిల్లలను వదులుతున్నారు. కానీ చేప వృద్ధి కాకముందే పట్టడంతో స్థానిక మత్స్యకారులకు ఉపాధి కరువైపోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం కృష్ణానదిలో ప్రభుత్వం ఇంత వరకు చేప పిల్లలను విడుదల చేయలేదు.

మాకు ఉపాధి లేకుండా చేస్తున్నారు

కృష్ణానదిలో ఆంధ్ర జాలర్లు అలివి వలల ద్వారా చిన్న చేపలు పట్టి మాకు ఉపాధి లేకుండా చేస్తున్నారు. అలివి వలలు ఉపయోగించడం ద్వారా చిన్న సైజు చేపలు కూడా వలలకు చిక్కుతున్నాయి. భవిష్యత్తులో మత్స్య సంపద అంతరించిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే కొన్ని రకాల చేపలు నదిలో లభించడం లేదు. ఉన్నతాధికారులు స్పందించాలి.
- బాలు, మత్స్యకారుడు, మంచాలకట్ట



మొక్కజొన్న కంకులు దగ్ధం


అగ్నికి కాలిన మొక్కజొన్న పంట

లింగాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన లింగాల శివారులోని వ్యవసాయ పొలంలో నిల్వ ఉంచిన మొక్కజొన్న కంకులు అగ్ని ప్రమాదంలో దగ్ధమైన సంఘటన శుక్రవారం జరిగింది. బాధిత రైతు గోడవర్ల తిరుపతయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పది ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినట్లు తెలిపారు. వర్షాలు కురుస్తున్న కారణంగా తెంపిన మొక్క జొన్న కంకులను ధాన్యంగా మార్చలేదని వెల్లడించారు. వ్యవసాయ పొలంలో నిల్వ ఉంచిన బాగా ఎండిన మొక్కజొన్న కంకుల కుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టగా పెద్దగా మంటలు రేగాయి. చుట్టూ ఉన్న రైతులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి మంటలు ఇతర మొక్కజొన్న కుప్పలపైకి వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకుంటూ మంటలను ఆర్పడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లు తెలిపారు.

ముగిసిన బండలాగుడు పోటీలు


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి

పెంట్లవెల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి మండలం కొండూరు గ్రామంలో ఒంగోలు జాతి పశువుల బండలాగుడు పోటీలు న్యూ కేటగిరి బహుమతులు మాజీ సర్పంచు నల్లపోతుల గోపాల్ ప్రదానం చేశారు. మొత్తం 16 జతల ఎద్దులు పాల్గొనగా మొదటి బహుమతి బాపట్ల జిల్లాకు చెందిన కోటంరెడ్డి ఎద్దులు రూ. 60వేలు సాధించాయి. అదే విధంగా రెండో బహుమతి హైదరాబాద్‌కు చెందిన ఆర్‌కె ఎద్దులు రూ. 45వేలు సాధించాయి. మూడో బహుమతి హైదరాబాద్‌కు చెందిన రోషన్‌బాబు ఎద్దులు రూ. 25వేలు సాధించాయి. అంతకు ముందు ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వచ్చి న్యూ కేటగిరి బండలాగుడు పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జూపల్లి అరుణ్, రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ, గ్రామస్థులు రెడ్డిరవి, కురుమయ్య పాల్గొన్నారు.

నేడు కృష్ణానది మీదుగా శ్రీశైలానికి లాంచీ ప్రయాణం

కొల్లాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండలం సోమశిల కృష్ణానది మీదుగా శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణం నేడు ప్రారంభం కానుంది. శనివారం ఉదయం తొమ్మిది గంటలకు సోమశిల కృష్ణానది మీదుగా శ్రీశైలం వరకు ప్రారంభం కానున్న లాంచీ ప్రయాణం 7 గంటల వ్యవధిలో పాతాళగంగ వరకు చేరుకుంటుంది. తిరిగి ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు పాతాళ గంగ నుంచి ప్రారంభమై మధ్యాహ్నం మూడు గంటలకు సోమశిలకు చేరుతుంది. కృష్ణానది మీదుగా శ్రీశైలం వరకు సాగే లాంచీ ప్రయాణం పర్యాటకులకు కనువిందు చేయనుంది. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందిన వారికే తెలంగాణ టూరిజం శాఖ అధికారులు లాంచీ ప్రయాణంలో అవకాశం కల్పించనున్నారు.


సోమశిల వద్ద కృష్ణానదిలో ప్రయాణానికి సిద్ధంగా ఉన్న లాంచీలు

'నవోదయ'కు గడువు పొడిగింపు

బిజినేపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): వట్టెంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ, 11వ తరగతుల్లో ప్రవేశం పొందేందుకు నిర్వహించే ప్రవేశ పరీక్ష దరఖాస్తుల స్వీకరణను నవంబరు 9 వరకు గడువు పొడించినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ పి.భాస్కర్ కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్హులైన 8వ, 10వ తరగతి విద్యార్థులు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్షలో ఎంపికైన విద్యార్థులు 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కళా ఉత్సవ్-2024 న్యాయ నిర్ణేతగా కొల్లాపూర్ ప్రొఫెసర్

కొల్లాపూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో కళా ఉత్సవ్-2024 హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు న్యాయ నిర్ణేతగా పడకంటి మహేష్ నియమితులయ్యారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్షణ తెలంగాణ, రాబోయే రాష్ట్ర స్థాయి కళా ఉత్సవ్ పోటీలు 2024కు న్యాయ నిర్ణేతగా పడకంటి మహేష్‌ను నియమించారు. ఇతను కొల్లాపూర్ లోని పాలమూరు యూనివర్సిటీ పీజీ సెంటర్‌లో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. కళలు, సౌందర్య శాస్త్రంలో విద్యాశాఖ, ఎన్‌సీఈఆర్‌టి నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి పోటీలు 2024 నవంబరు 1, 2వ తేదీల్లో హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, మాదాపూర్ రోడ్‌లోని సీసీఆర్‌టీలో జరుగుతున్నాయి. విజువల్ ఆర్ట్స్ 2డి, 3డి, స్వదేశీ బొమ్మలు, ఆటల కేటగిరీలకు ప్రత్యేకంగా నవంబరు 1వ తేదీన మహేష్ న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తారు. కళా ఉత్సవ్ అనేది తెలంగాణ అంతటా విద్యార్థులలో సృజనాత్మక ప్రతిభను పెంపొందించే లక్ష్యంతో కళ, సంస్కృతిని ప్రతిబింబించేలా జరుపుకునే ఒక గౌరవ ప్రదమైన వేదిక అని పీజీ సెంటర్ అధ్యాపకులు పేర్కొన్నారు.


న్యాయ నిర్ణేతలుగా నియమితులైన మహేష్

గల్లంతైన యువకుడి మృతి



చెక్‌డ్యాంలో గాలిస్తున్న ఎస్ఐ నరేశ్, (ఇన్‌సెట్లో) విష్ణు (ఫైల్)

గోపాల్‌పేట, నవంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలోని బుద్దారం గండి వద్దనున్న చెక్‌డ్యాంలో పడి గల్లంతయిన యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ నరేశ్, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెన్నూరు గ్రామానికి చెందిన శ్రీను, విష్ణు(22) గత నెల 30న మధ్యాహ్నం ఈత కొట్టేందుకు చెక్‌డ్యాంలో దిగారు. కొద్దిసేపటి తర్వాత శ్రీను బయటకు వచ్చాడు. విష్ణు నీటిలో గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ నరేశ్ కుమార్, అగ్నిమాపక సిబ్బందితో కలిసి చెక్‌డ్యాంలో గాలించారు. సాయంత్రం వరకు మృతదేహం లభించకపోవడంతో మరుసటి రోజు కూడా గాలిం చగా, విష్ణు మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కాగా విష్ణుకు ఐదేళ్ల క్రితం శ్రీపురం గ్రామానికి చెందిన హారికతో వివాహమైంది.

యువతిపై లైంగిక వేధింపులు

» పోలీసులకు ఫిర్యాదు చేసిన కుటుంబ సభ్యులు

ధరూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై ఓ యువకుడు లైంగిక వేధింపులకు పాల్పడిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. మూడు రోజులుగా అతడు వేధిస్తున్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అతడిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. సంఘటనపై ధరూరు ఎస్ఐ అబ్దుల్ షుకూర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా బాధితురాలి కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందిందని, సమగ్ర విచారణ చేపట్టామని తెలిపారు.

ఆలయంలోని హుండీలో నగదు చోరీ

గట్టు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు హుండీ తలుపు విరగ్గొట్టి, నగదును ఎత్తుకెళ్లారు. గురువారం పండుగ సందర్భంగా గుడికి కోసం వచ్చిన భక్తులు హుండీని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అదే విధంగా గండి ఆంజనేయ స్వామి ఆలయం ముందున్న గంటలు కూడా చోరీకి గురైనట్లు స్థానికులు తెలిపారు..

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం సమీపంలోని కేసరి సముద్రంలో గుర్తు తెలియని పురుషుడి మృతదేహం (30) లభ్యమైనట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియిన వ్యక్తి చెరువులో దిగి గల్లంతయ్యాడు. ఆ విషయాన్ని అక్కడే చేపలు పడుతున్న కొందరు యువకులు గుర్తించి పోలీసులకు తెలిపారు. వారు అగ్నిమాపక సిబ్బందితో కలిసి చెరువులో గాలించగా అతడి ఆచూకీ లభించలేదు. గురువారం అతడి మృతదేహం నీటిలో తేలింది. పోలీసులు శవాన్ని బయటకు తీసి జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అభివృద్ధి పథంలో.. పీయూ



పీయూ ప్రధాన ద్వారం



పాలమూరు యూనివర్సిటీలోని పరిపాలనా భవనం

లా, ఇంజనీరింగ్ కళాశాలలకు త్వరలో శంకుస్థాపన

పాలమూరు యూనివర్సిటీ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు విశ్వవిద్యాలయం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది. యూనివర్సిటీ ఏర్పాటు తర్వాత గత పదహారేళ్లలో ఎన్నడూ లేనంతగా అత్యధిక నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. అలాగే పీయూ క్యాంపస్‌లో లా, ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుకు గత నెల 26న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారు. ఆయా కళాశాలల భవన నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నారు. వాటితో పలు పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం హాజరు కానున్నారు. వచ్చే విద్యా సంవత్సరం (2025-26) నుంచి ఈ రెండు కళాశాలలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో యూనివర్సిటీలో అభివృద్ధి పనులను వేగవంతం చేశారు.

త్వరలో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

సొంత జిల్లాలోని పాలమూరు యూనివర్సిటీ క్యాంపస్‌లో లా, ఇంజనీరింగ్ కళాశాలలతో పాటు, బాలురు, బాలికల వసతిగృహాలు, అదనపు గ్రంథాలయం, రెండు వేల మంది కూర్చునే సామర్థ్యం ఉన్న సెమినార్ హాల్, హెల్త్ సెంటర్, స్విమ్మింగ్‌పూల్ నిర్మాణాలకు త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వీటితో పాటు పరిశోధనా కేంద్రం, ఏడు వందల మంది విద్యార్థి నులకు వసతి గృహం, సింథటిక్ ట్రాక్, క్యాంటిన్ భవనాలను ఆయన ప్రారం భించనున్నారు. అలాగే 2008లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించిన శిలాఫలకాన్ని గత ప్రభుత్వ హయాంలో యూనివర్సిటీ పునర్నిర్మాణం పేరుతో పక్కన పెట్టారు. ఆ శిలాఫలకాన్ని తిరిగి ఏర్పాటు చేయనున్నారు.

రూ. 136.65 కోట్లు మంజూరు

న్యాయ కళాశాలకు రూ.50 కోట్లు, ఇంజనీరింగ్ కళాశాలకు రూ.86.65 కోట్లు అవసరం అవుతాయని యూనివర్సిటీ అధికారులు ప్రతిపాదనలు పంపించగా, ఆ మేరకు నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం 'ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్' ద్వారా రూ.100 కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో యూనివర్సిటీలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో పాటు పీఎం అజయ్ ప్రాజెక్టులో భాగంగా వసతి గృహ భవనాల కోసం రూ. 14 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపించగా, నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ లభించిందని అధికారులు చెప్తున్నారు. దీంతో యూనివర్సిటీకి నిధుల కొరత తీరనుంది.

వేగంగా కొనసాగుతున్న పనులు

ముఖ్యమంత్రి హోదాలో ఉమ్మడి రాష్ట్ర సీఎం రాజశేఖర్‌రెడ్డి తర్వాత, ఇప్పుడు రేవంత్‌రెడ్డి పాలమూరు యూనివర్సిటీకి రానున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు, జిల్లా శాసనసభ్యులు, ముఖ్యనాయకులు పనులపై పూర్తిపై ప్రత్యేక దృష్టి సారించారు. గత నెల 28న మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వీసీ జీఎన్ శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, పలువురు ముఖ్య నాయకులు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

భర్తీ కానున్న బోధన, బోధనేతర ఉద్యోగాలు

పాలయూరు యూనిర్సిటీకి లా, ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ కోర్సులు మంజూరు కావడంతో అందుకు అవసరమైన అధికారులు, అధ్యాప కులు, బోధనేతర సిబ్బందిని ప్రభుత్వం నియమించనున్నది. అందులో ఇంజనీరింగ్ కళాశాలకు 27 మంది, లా అండ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ విభాగంలో 14 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లను నియమించనున్నారు. వారితో పాటు లైబ్రేరియన్ ఒకటి, ఫిజికల్ ఒకటి, మొత్తంగా 43 మంది అధ్యాపక పోస్టులను భర్తీ చేయనున్నారు. అలాగే బోధన సిబ్బంది పోస్టులు 27, మొత్తంగా 70 మందిని కొత్తగా నియమించేందుకు అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేశారు.



భవనాల నిర్మాణానికి సంబంధించిన ప్లాన్‌ను పరిశీలిస్తున్న వీసీ, ఇంజనీరింగ్ అధికారులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అభివృద్ధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో యూనివర్సిటీ అభివృద్ధి సాధ్యం అవుతుంది. నేను ఇక్కడికి రాగానే నిధుల సమస్య ఉందని తెలిసింది. ఇక్కడి ప్రజాప్రతినిధులను కలిసి సమస్యను వివరించాను. వారి సహకారంతో లా, ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ కోర్సులు మంజురయ్యాయి. అందుకు అవసరమైన నిధులు మంజూరు అవుతుండటం సంతోషకరం. అతి త్వరలోనే నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తాం.

- పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్



పీయూకు ప్రపంచ స్థాయి గుర్తింపు

పాలమూరు యూనివర్సిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, ప్రపంచ స్థాయి గుర్తింపునకు కృషి చేస్తున్నాం. లా, ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్స్ కోర్సులతో పాటు, ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నాం. జిల్లాకు చెందిన పేద విద్యార్థులు ఉన్నత చదువుల కోసం దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా అన్ని రకాల కోర్సులను అందుబాటులోకి తెచ్చి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం.

- యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే.



కురుమూర్తి రాయుడికి పట్టు వస్త్రాలు

» ఉపవాస దీక్షతో సిద్ధం చేస్తున్న అమరచింత చేనేత కార్మికులు
» ఆరున అలంకారోత్సవం రోజు స్వామి వారికి సమర్పణ
» గురువారం మండపారాధనతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



స్వామి, అమ్మవార్ల కోసం పట్టు వస్త్రాలను నేస్తున్న పవిత్ర, కుర్మన్న దంపతులు

అమరచింత, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మోత్సవాల సందర్భంగా కురుమూర్తి వేంకటేశ్వర స్వామికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలు సిద్ధం అవుతున్నాయి. ఉత్సవాల్లో మొదటి ఘట్టమైన అలంకారోత్సవం రోజున ఈ వస్త్రాలను స్వామివారికి సమర్పించనున్నారు. తెలంగాణ తిరుపతిగా భక్తుల పూజలందుకుంటున్న కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు అమరచింత చేనేత కళాకారులు పట్టు వస్త్రాలను సమర్పించడం గత 65 ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. అప్పట్లో గ్రామానికి చెందిన కొంగరి చెన్నయ్య అనే వ్యక్తి స్వామి వారికి పట్టు వస్త్రాలు ఇస్తానని మొక్కుకున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి సమర్పించారు. ఆయన కుటుంబీకులు కూడా ఆనవాయితీని కొనసాగించారు. ఆయన మరణానంతరం 1983లో గ్రామానికి చెందిన నేత కార్మికుడు కోటకొండ కుర్మన్న కురుమూర్తి స్వామి సన్నిధిలో కోనేరు నీటిలో ఖాళీ డ్రమ్ములపై ప్రత్యేక మగ్గం ఏర్పాటు చేసుకొని అక్కడే నిష్ఠతో పట్టు వస్త్రాలను నేసి స్వామికి సమర్పించారు. ఆ తర్వాత అదే గ్రామానికి చెందిన నరాల సింగోటం కూడా అలాగే పట్టు వస్త్రాలను తయారు చేసి స్వామికి సమర్పించారు. అనంతరం 2005 నుంచి నుంచి 2012 వరకు పట్టణానికి చెందిన దేవరకొండ లచ్చన్న కుటుంబీకులు ఈ ఆచారాన్ని కొనసాగించారు. ఆ తర్వాత ఈ కార్యక్రమంలో పద్మశాలి కులస్తులంతా భాగస్వాములయ్యారు. ప్రతీ ఏడాది లక్కీ డిప్ ద్వారా నేత కుటుంబాలను ఎంపిక చేస్తున్నారు. వారు స్థానిక మార్కండేయ ఆలయంలో పట్టు వస్త్రాలను నేత పనిని కొనసాగిస్తున్నారు. ఇలా ఎంపిక చేసిన కుటుంబాల వారు గత నెల 27న ప్రత్యేక పూజల అనంతరం నేత పనిని ప్రారంభించారు.

నిష్ఠతో పట్టు వస్త్రాల తయారీ

స్వామివారికి సమర్పించే పట్టు వస్త్రాల నేత పనిని అత్యంత నిష్ఠతో కొనసాగిస్తారు. నేత పనిని ప్రారంభించి, పూర్తి చేసే వరకు వారు మాంసాహారం తీసుకోరు. అలాగే ప్రతీ నిత్యం ఉపవాస దీక్ష చేపట్టి మగ్గానికి పూజ చేసి పనిని కొనసాగిస్తారు. పట్టు పంచె, కండువా, పట్టు కోటు, అమ్మ వారికి పట్టు చీర, రవికెలను సిద్ధం చేస్తారు. అందుకోసం పట్టు రేషం, జలతారు, పగడ తదితర ముడి సరుకును వినియోగిస్తారు. ఇలా సిద్ధం చేసిన పట్టు వస్త్రాలను ఈ నెల ఆరున అలంకారోత్సవం సందర్భంగా స్వామి వారికి సమర్పిస్తారు. ముందుగా అమరచింత నుంచి బాణసంచా పేలుళ్లు, మంగళ వాయిద్యాల మధ్య వస్త్రాలను ఊరేగింపుగా ఆత్మకూరులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తీసుకెళ్తారు. అక్కడ పూజలు చేసి, స్వామివారి బంగారు ఆభరణాలతో పాటు ఊరేగింపుతో కురుమూర్తికి తీసుకెళ్తారు. అలంకరోణత్సవం సందర్భంగా స్వామి వారికి సమర్పిస్తారు.

అదృష్టంగా భావిస్తున్నా

పగడాకుల కుర్మన్న : కురుమూర్తి స్వామి పట్టు వస్త్రాల నేత పని ఈ సారి తమకు రావడాన్ని అదృష్టంగా భావిస్తున్నా. గతంలో మా నాన్న కూడా పట్టు వస్త్రాలు నేశారు. గ్రామంలో తరతరాలుగా వస్తున్న ఆనవాయితీని కొనసాగిస్తాం.

పట్టు వస్త్రాల తయారీతో జన్మ ధన్యం

పవిత్ర : కురుమూర్తి స్వామి వారి పట్టు వస్త్రాల నేత పనిలో అవకాశం రావడంతో మా జన్మ ధన్యమైంది. మహిమాన్విత కురుమూర్తి స్వామి, అమ్మ వారికి సమర్పణకు పట్టు వస్త్రాలు నేసే అవకాశం మళ్లీ మళ్లీ రావాలని కోరుకుంటా.



పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం

దేవరకొండ లచ్చన్న, పద్మశాలి సంఘం నాయకుడు : పట్టు వస్త్రాలను తయారు చేసి స్వామి వారికి సమర్పించడం పూర్వీకుల నుంచి వస్తున్న ఆనవాయితీ. గతంలో ఎనిమిది సంవత్సరాలు మా కుటుంబం నుంచే వస్త్రాలను రూపొందించాం. ప్రస్తుతం సంఘం తరఫున తయారు చేస్తున్నాం. ఈ ఆచారాన్ని సంఘం సభ్యులందరమూ కొనసాగిస్తాం.

గోవిందా.. గోవిందా...



మండప ఆరాధన చేస్తున్న అర్చకులు

చిన్నచింతకుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి క్షేత్రంలో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గోవిందా.. గోవిందా.. అని భక్తుల నామస్మరణతో సప్త గిరులు మారుమోగాయి. ఉదయం యాగశాల, మండప అలంకరణతో అర్చకులు బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. అనంతరం వేదపండితులు, అర్చకులు భగవదనుజ్ఞ, విష్వక్సేనారాధన, పుణ్యాహ వచనము, ఋత్విక్ వరణము, వాస్తుపూజ, అగ్ని ప్రతిష్ఠ, శాత్తుముర్లై, మంగళనీరాజనం నిర్వహించారు. శుక్రవారం ఆవాహిత దేవతా పూజ, హోమాలు తదితర విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని తిలకిం చేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. జాతర మైదానంలో దాసంగాలు పెట్టి, మొక్కులు తీర్చుకున్నారు.



స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

క్రైం కార్నర్

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి

ఖిల్లాఘణపురం, నవంబరు 1, (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలంలోని మానాజీపేటకు చెందిన సామల నాగరాజు (46) శుక్రవారం గ్రామ శివారులోని నీటి కుంటలో పడి మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగరాజు ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం అతడు కుంట ఒడ్డున దుస్తులు, చెప్పులను వదిలి నీటిలోకి దిగి, మునిగి పోయాడు. ఈ విషయంపై పోలీసులకు సమాచారం అందడంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య నిర్మల, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈ విషయంపై ఎస్ఐ సురేశ్‌గౌడ్‌ను వివరణ కోరగా అతడి భార్య హైదరాబాద్‌లో ఉంటోందని, ఇప్పటి వరకు ఫిర్యాదు అందలేదన్నారు.

మిల్లులో అగ్నిప్రమాదం

జడ్చర్ల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని నూర్ ఇండస్ట్రీస్ వేరుశనగ మిల్లులో బుధవారం అర్ధరాత్రి తర్వాత అగ్ని ప్రమాదం జరిగింది. మిల్లులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను ఆర్పివేసింది. అప్పటికే ఆరు వేల గోనె బస్తాలు కాలిపోయాయి. మూడు లక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని యజమాని సయ్యద్ అశ్వక్ తెలిపారు.

మరిన్ని క్యాంపులు నిర్వహిస్తాం

» స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి



శిక్షణ పొందిన క్రీడాకారులతో స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి

చిన్నచింతకుంట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద క్రీడాకారులను ప్రోత్సహించేందుకు భవిష్యత్తులో మరిన్ని శిక్షణ శిబిరాలను నిర్వహిస్తామని స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, చిన్నచింతకుంట మండలంలోని అల్లీపురం ఇందిరమ్మ మినీ ఇండోర్ స్టేడియంలో వారం రోజుల పాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ ఈ నెల మూడు నుంచి ఐదవ తేదీ వరకు అడ్డాకుల మండలంలోని రాచాల గ్రామంలో నిర్వహించనున్న అండర్-19 కబడ్డీ పోటీల్లో చాంపియన్‌గా నిలవాలని ఆకాంక్షించారు. పోటీల్లో రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తేవాలన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా జట్టుకు ట్రాక్ సూట్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోచ్ మల్లేష్, జూనియర్ అసిస్టెంట్ నరేశ్, మాజీ సర్పంచ్ రఘువర్ధన్‌గౌడు, మాజీ కోఆప్షన్ సభ్యుడు మహేందర్‌రెడ్డి, రాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

మట్టి టిప్పర్, ఎక్స్‌కవేటర్ సీజ్

వంగూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని ఉమ్మాపూర్ వద్ద డీఎల్ఐ కాల్వ నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను, లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. రెండు వాహనాల డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక, మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇథనాల్ కంపెనీ వద్దే వద్దు



చినతాండ్రపాడులో సమావేశమైన రెండు గ్రామాల ప్రజలు

అయిజ, నవంబరు1 (ఆంధ్రజ్యోతి) : తుంగభద్ర నది సమీపంలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటు చేయొద్దని జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని తాండ్రపాడు, నౌరోజీ క్యాంపు గ్రామస్థులు స్పష్టం చేశారు. చినతాండ్రపాడు గ్రామంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ గౌడ్ అధ్వర్యంలో శుక్రవారం వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగభద్రా నది సమీపంలో ఇథనాల్ కంపెనీ ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. కంపెనీ ఏర్పాటైతే నది నీరు కలుషితం అవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు స్పందించి పరిశ్రమను రద్దే చేయాలని కోరారు. సమా వేశంలో మాజీ ఉప సర్పంచు మహేష్‌నాయుడు, సత్యంనాయుడు, వందనం, సత్యన్న, భగత్‌సింగ్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నాం

● తహసీల్దార్ శ్రీనివాసులు



కోస్గి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని తహసీల్దార్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నాం. అదేవిధంగా ధరణి, ప్రభుత్వ భూముల ఆక్రమణ, నాలాలపై సర్వే చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నామన్నారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

ధరణి సమస్యలు పరిష్కారం అవుతున్నాయా?

సమస్యను ఒక్కొక్కటిగా పరిశీలించి, పరిష్కరిస్తున్నాం.

ప్రభుత్వ భూముల ఆక్రమణకు ఏమైనా చర్యలు తీసుకున్నారా?

ప్రభుత్వ భూములు ఆక్రమించినట్లు మా దృష్టికి వస్తే వెంటనే సర్వే నిర్వహించి కలెక్టర్‌కు పంపుతున్నాం. తర్వాత కలెక్టర్ ఆదేశానుసారం చర్యలు తీసుకుంటాం.

ఇప్పటివరకు అలా ఏమైనా గుర్తించారా?

పట్టణంలోని నాగులబావి సర్వే నెంబర్ 1650ను గుర్తించాం. సర్వే చేసి కలెక్టర్‌కు నివేదిక పంపాం. తదుపరి ఆదేశానుసారం చర్యలు తీసుకుంటాం. ఆక్రమించుకున్న వారిని ఖాళీ చేయిస్తాం.

ప్రభుత్వ భూమి ఆక్రమించి భవనాలు కట్టుకుంటే ఏం చేస్తారు?

ప్రభుత్వ భూమిలో భవనాలు కట్టుకుంటే వాటికి అనుమతి ఎవరు ఇచ్చారో చూస్తాం. ఆ అధికారి వివరణతో ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూల్చివేయిస్తాం.

న్యూస్ బాక్స్

విద్యార్థులకు సబ్జెక్టుపై ఆసక్తిని పెంపొందించాలి

మరికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు సబ్జెక్టుపై ఆసక్తిని పెంపొందించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి విద్యాసాగర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పల్లెగడ్డ, పసుపుల గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. సీఆర్‌పీ శివకుమార్ ఉన్నారు.

నేడు ఆనాకులం గోకులంలో గోవర్ధన పూజలు

మక్తల్‌రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): గోమాతను పూజిస్తే 33 కోట్ల దేవతలను పూజించిన ఫలం కలుగుతుందని అందుకే ప్రతీ ఒక్కరిని గోపూజలో భాగస్వాములను చేసే లక్ష్యంతో శనివారం మక్తల్ మండలం పసుపుల సమీపంలోని ఆనాకులం గోకులం గోశాలలో(గోవర్ధన పూజ) గోపూజ నిర్వహించనున్నామని గోశాల నిర్వాహకులు కొడంగల రాధాకృష్ణ భట్, రఘుప్రసన్నభట్, మోహన్‌భట్‌లు తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ కార్యక్రమానికి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొండయ్యలు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. దీపావళి మరుసటి రోజున గోవర్దన పూజను ఆచరించడం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయమని, అందుకే అనాకులం-గోకులం గోశాలలో ప్రతీ సంవత్సరం వలే ఈ సంవత్సరం కూడా శనివారం గోవర్దన పూజతో పాటు, శ్రీసూక్త హోమం అన్నదానం మొదలైన కార్యక్రమాలు జరుగుతాయని వారు వివరించారు.

రెనివట్లలో ఘనంగా సదర్ ఉత్సవాలు

మద్దూర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెనివట్ల గ్రామంలో యాదవులు గురువారం రాత్రి సదర్ ఉత్సవాలు నిర్వహించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు సలీం ఉత్సవాలను ప్రారంభించారు. శిక్షణ పొందిన గేదెలతో యాదవులు వివిధ రకాల విన్యాసాలు నిర్వహించారు. అంతకు ముందు గేదెలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామంలో ఊరేగించారు. యాదవ సంఘం సభ్యులు రాములు, బస్వరాజు, మల్లేష్, వెంకటయ్య, యాదగిరి పటేల్, గోవర్ధన్, కురుమూర్తి, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులకు మతిభ్రమించింది

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

మరికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ నాయకులకు మతిభ్రమించిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కే.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తీలేరు గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పదినెలల్లోనే ముఖ్యమంత్రి, మంత్రులు కరెంట్ చార్జీలు పెంచుతున్నట్లు ఎక్కడా, ఎప్పుడూ అనలేదన్నారు. కానీ బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేసి తామే పోరాటం చేసిన మూలంగా ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచలేదని సంబురాలు చేసుకోవడం చూస్తుంటే అధికారం కోల్పోయిన బాధలో ఏం చేయాలో తెలియక ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు.

నిర్మించారు.. వదిలేశారు

» నిరుపయోగంగా కూరగాయల మార్కెట్

» రోడ్డుపైనే విక్రయాలు

» వాహనదారులకు అంతరాయం



రోడ్డుపై కొనసాగుతున్న కూరగాయల విక్రయాలు



నిరుపయోగంగా ఉన్న మార్కెట్ షెడ్లు

కోస్గి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కోస్గి మునిసిపల్ కేంద్రంలో ప్రధాన రహదారిపై నిర్మించిన కూరగాయల మార్కెట్ నిరుపయోగంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో కోటి రూపాయల ప్రజాధనంతో పట్టణంలో కూరగాయల మార్కెట్ నిర్మించి షెడ్లు నిర్మించారు. అయితే షెడ్లలో వినియోగదారులు తిరగడానికి సరైన స్థలం లేకపోవడంతో వ్యాపారులు రోడ్డుపై అమ్మకాలు చేపడుతున్నారు. ఎక్కువమంది మార్కెట్‌లోకి వెళ్లారంటే బయటకు రావడం కష్టతరంగా మారింది. ప్రస్తుతం ఈ మార్కెట్ వాహనాల పార్కింగ్‌గా మారింది. కోస్గి మునిసిపాలిటీలో కూరగాయల సంత వేలం నిర్వహిస్తే ప్రతిఏటా సుమారు రూ.25 లక్షల దాకా తైబజార్ ఆదాయం మునిసిపాలిటీకి అందుతుంది. అంత ఆదాయం ఉన్నా కూరగాయల వ్యాపారులు మాత్రం రోడ్లపైనే క్రయవిక్రయాలు చేస్తున్నారు. వ్యాపారులకు కనీస సౌకర్యాలు లేవు. ఆదివారం ఇక్కడ సంత జరుగుతుంది. సంత రోజు ఈ రోడ్డుపై కనీసం వాహనాలు తిరగలేని పరిస్థితి ఉంటోంది. రోడ్లను ఆక్రమించి క్రయ విక్రయాలు జరుగుతుండడంతో కనీసం అంబులెన్స్ వెళ్లాలన్నా దారి దొరకని దుస్థితి చోటు చేసుకుంది. కూరగాయల వ్యాపారులకు షెడ్లు వేయించి రోడ్లపై అమ్మకాలు లేకుండా చూడాలని మునిసిపల్ అధికారులను కోరగా.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెబుతున్నారు తప్ప చర్యలు మాత్రం చేపట్టడం లేదని వినియోగదారులు పేర్కొన్నారు.

మాకు శాశ్వత షెడ్లు వేయిస్తే బాగుంటది



మేము ఏళ్ల తరబడి తైబజార్ చెల్లించుకుంటూ కనీస సౌకర్యాలు లేకుండా రోడ్డు మీదనే వ్యాపారం చేసుకుంటున్నం. రాజకీయ నాయకులు వస్తరు.. మీకు షెడ్లు వేయిస్తం.. స్థలం చూయిస్తం అని చెప్పి ఫొటోలు దిగుతరు, పోతరు.

- భాగ్యమ్మ, ఆకుకూరల వ్యాపారి

నిరుపయోగంగా ఉన్నాయి..



గత రెండు సంవత్సరాల క్రితం కూరగాయల కోసం షెడ్లు వేయించిండ్రు. కానీ అవి నిరుపయోగంగా ఉన్నాయి. అందులోకి యాభైమంది ఒకేసారి పోతే మళ్లీ తిరిగి వెనకకు రావడానికి రాదు. ఎలా నిర్మించారో తెలియదు. అధికారులు ఇప్పుడైనా శాశ్వత షెడ్లు వేయిస్తే బాగుంటది.

- సాజిద్, తమలపాకుల వ్యాపారి

ఘనంగా నరక చతుర్దశి



పేటలో టపాసులు కాల్చుతున్న ప్రజలు



దీపాల వెలుతురులో భూనీడు ఆంజనేయస్వామి ఆలయం

నారాయణపేట/మక్తల్ రూరల్/కోస్గి/మరికల్/ధన్వాడ/కొత్తపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా వ్యాప్తంగా నరక చతుర్దశి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం రాత్రి వ్యాపార సంస్థల్లో భక్తిశ్రద్ధలతో లక్ష్మీ పూజలు నిర్వహించి బాణసంచా కాల్చారు. ఇంట్లోని చిన్నా, పెద్ద అన్న తేడా లేకుండా లక్ష్మీ పూజలు నిర్వహించి టపాసులు పేల్చి ఆనందోత్సవాల మధ్య నరక చతుర్దశి వేడుకలను జరుపుకున్నారు. కొందరు శుక్రవారం సైతం లక్ష్మీ పూజలు నిర్వహించారు. ఎస్పీ యోగేష్‌గౌతమ్, సతీమణి శశికిరణ్ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి జిల్లాలోని తమ క్యాంపు కార్యాలయంలో దీపావళి వేడుకలను జరుపుకున్నారు. శనివారం బలిపాడ్యమి వేడుకలను జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకోనున్నారు.

అదేవిధంగా, మక్తల్, కోస్గి, మరికల్, ధన్వాడ, కొత్తపల్లి మండల కేంద్రాలతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో దీపావళి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు.

ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం



పేట ఎస్పీ కార్యాలయంలో ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ, పోలీసు సిబ్బంది

నారాయణపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నారాయణపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం జరుపుకున్నారు. పటేల్ చిత్రపటానికి ఎస్పీ యోగేష్‌గౌతమ్ పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతీయ సమైక్యతకు పునరంకితమై మాతృదేశానికి మనవంతు సేవ చేయడమే స్వాతంత్ర్య సమరయోధులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అవుతుందన్నారు. పటేల్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రీయ ఏక్తా దివస్‌గా పిలుస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రియాజ్, ఆర్‌ఐ నరసింహ, ఆర్ఎస్సై శివశంకర్ తదితరులున్నారు.

పటేల్ ఆశయాలను కొనసాగిద్దాం..

ఉక్కు మనిషి సర్దార్ వల్లబాయ్ పటేల్ ఆశయాలను కొనసాగిద్దామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యయాదవ్ పిలుపునిచ్చారు. నారాయణపేటలోని ఆ పార్టీ కార్యాలయంలో పటేల్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రఘువీర్‌యాదవ్, నందు నామాజీ, వెంకటయ్య, రాము, గోపాల్‌యాదవ్, సైదప్ప, శేఖర్, హన్మంత్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, పాండు తదితరులున్నారు.



బీజేపీ కార్యాలయంలో పటేల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కుటుంబ సర్వేపై నేడు అవగాహన సదస్సు

నారాయణపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట అంజనా గార్డెన్‌లో శనివారం ఉదయం 10 గంట నుంచి 12:30 గంటల వరకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే (సమగ్ర ఇంటింట కుటుంబ సభ్యుల సర్వే) అవగాహన సదస్సు జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి నారాయణపేట, మక్తల్ ఎమ్మెల్యేలు చిట్టెం పర్ణికారెడ్డి, వాకిటి శ్రీహరిలు హాజరవుతారన్నారు. జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు, మేధావులు, బీసీ సంఘాలు, వివిధ కుల సంఘాలు హాజరు కావాలని ఆయన కోరారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన

నారాయణపేటరూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొల్లంపల్లి గ్రామంలో జిల్లా న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పారా లీగల్ వలంటీర్ శారద బాల్యవివాహాలు, బాలకార్మికులు, ఉమెన్స్ హెల్ప్‌లైన్‌లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఉచిత న్యాయ సలహాలు, సందేహాలు, మరింత సమాచారం కోసం 15100 టోల్ ఫ్రీనంబర్‌కు కాల్ చేయాలన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు

మక్తల్‌రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ఈనెల మూడో తేదీన ఉదయం 10:30 గంటలకు విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం ప్రాంగణంలో వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహించనున్నామని ఎస్ఈ సంజీవరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో విద్యుత్ వినియోగదారుల బిల్లింగ్ సమస్యలు, సరఫరాలో అంతరాయాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, స్తంభాల ఏర్పాటు వంటి విషయంలో పరిష్కారం కోసం ఏదైనా సమస్య ఉన్నట్లయితే తెలపాలన్నారు. అవకాశాన్ని నారాయణపేట జిల్లా విద్యుత్ వినియోగదారులు వినియోగించుకోవాలని ఏఈ రామకృష్ణ, నారాయణపేట డీఈ బి.లక్ష్మి నరసింహ్మారావు తెలిపారు.

ఆంజనేయస్వామి ఆలయంలో అమావాస్య పూజలు

మరికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హనుమాన్‌వాడ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం దీపావళి పండుగ అమావాస్య సందర్భంగా రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. స్వామి వారికి పురోహితుడు వేద మంత్రోచ్చరణాలతో విశేష పూజలు చేశారు.

ఉమా మహేశ్వరాలయంలో..

మక్తల్ రూరల్ : మక్తల్ పట్టణంలోని ఆజాద్‌నగర్‌లో వెలిసిన ఉమా మహేశ్వరాలయంలో దీపావళి అమావాస్య పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు సిద్ధరామయ్య స్వామి ఆధ్వర్యంలో తెల్లవారు జామున స్వామివారికి మహాన్యాసపూర్వక అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం మహామంగళ హారతి అనంతరం నాగరాజు కుటుంబ సభ్యులు హాజరైన భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదినం



ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి తిరుపతి లడ్డూను అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

మక్తల్ రూరల్/నర్వ/ధన్వాడ/కృష్ణ/మాగనూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి జన్మదినాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. మక్తల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఆయన చిన్ననాటి మిత్రులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే 53వ జన్మదినం సందర్భంగా 53 మంది రక్తదానం చేసినట్లు మిత్రులు తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సౌభాగ్యలక్ష్మి రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చిన్ననాటి మిత్రులు సీఎస్‌మూర్తి, సోమశేఖర్, కావాలి శ్రీనివాసులు, గోవర్దన్, నరేందర్‌రెడ్డి, బొడ్కె శ్రీకాంత్, చిన్నకొండయ్య, వాకిటి శ్రీనివాసులు, వెంకట్రామిరెడ్డి, కాడ్గి సత్యనారాయణ, సొంత శ్రీకాంత్, గోల్డ్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా, పాతర్‌చేడ్ గ్రామంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు లంకాల మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో నాయకులు, కార్యకర్తలు 45 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధి సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ధన్వాడలో ముదిరాజ్ సంఘం నాయకులు గంగామాత దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నీరటి నర్సిములునాయుడు, మార్కెట్ యార్డు డైరెక్టర్ నీరటి రాంచంద్రయ్యముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. కృష్ణలోని క్షీరలింగేశ్వరస్వామి దేవాలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, కేక్ కట్ చేశారు. మాగనూరు పీహెచ్‌సీలో పార్టీ నాయకులు రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. మక్తల్ మండలంలోని సంగంబండ ప్రాజెక్టు కుడి కెనాల్ వద్ద కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, ఆనంద్‌గౌడ్, మక్తల్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్, మండల అధ్యక్షుడు గణేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం

మక్తల్‌రూరల్ : మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తన జన్మదినాన్ని పురస్కరించుకొని సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి శాలువా కప్పి, తిరుపతి లడ్డు ప్రసాదాన్ని అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో వాకిటి శ్రీహరి మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

గ్రామీణ గ్రంథాలయాలను ఆధునికీకరిస్తాం

- గ్రంథాలయ సంస్థ చైర్మన్ విజయ్‌కుమార్



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న చైర్మన్

మరికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ గ్రంథాలయాలను ఆధునికీకరిస్తామని గ్రంథాలయ సంస్థ చైర్మన్ వరాల విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామీణ గ్రంథాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. గ్రంథాలయం సమస్యలను గ్రంథ పాలకుడు మల్లికార్జున్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఎక్కడైనా ప్రభుత్వ స్థలం చూపిస్తే అన్ని హంగులతో కొత్త భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. అలాగే పాఠకులకు, నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు కావల్సిన పుస్తకాలను వారంరోజుల్లో పంపిణీ చేస్తామన్నారు. జిల్లా గ్రంథాలయ అధికారి సురేష్‌బాబు ఉన్నారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి ఘన నివాళి



మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

మరికల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మరికల్ పట్టణ అధ్యక్షుడు హరీశ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు ప్రధానిగా ఇందిరాగాంధీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌కుమార్, ఎల్.రాములు, సూర్యప్రకాష్, రామకృష్ణారెడ్డి, సురేందర్‌గౌడ్, పోగుల అంజి, కుమ్మరి చెన్నప్ప, గొల్లరాజు తదితరులున్నారు.

భావితరాలకు మార్గదర్శకులు సీనియర్ సిటిజన్స్

- బాల కేంద్రంలో ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం



సీనియర్ సిటిజన్స్‌ను సత్కరిస్తున్న డాక్టర్ సాయిబాబ, మల్లేష్ తదితరులు

నారాయణపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు మార్గదర్శకులు సీనియర్ సిటిజన్స్ అని, సమాజంలో తల్లిదండ్రులతో పాటు పెద్దలకు ప్రేమను పంచి గౌరవించాలని డాక్టర్ సాయిబాబ, సింగిల్ విండో డైరెక్టర్ మల్లేష్ అన్నారు. గురువారం విద్యావంతుల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ వెంకట్రాములు ఆధ్వర్యంలో స్థానిక బాల కేంద్రంలో వయో వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎంఈవో వెంకట్‌రెడ్డి, రిటైర్డ్ ఏఈ ఆత్మరామ్‌ఎడ్కే, కొనంగేరి నారాయణ, కవి రామ్మోహన్‌రావు, బన్సీలాల్, అంబాజీరావు, మాజీ కౌన్సిలర్ చిన్నయ్య, బుగ్గప్ప, వెంకట్రాములు తదితరులను పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్పీ బాలు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, బాలకేంద్రం నిర్వాహకులు సంగ నర్సింములు, దూస నర్సింహులు తదితరులున్నారు.

టీడీపీ సభ్యత్వానికి శ్రీకారం



టీడీపీ సభ్యత్వ నమోదులో ఓంప్రకాష్ ముదిరాజ్

నారాయణపేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సిములు ఆదేశంతో ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు ఓంప్రకాష్ ముదిరాజ్ నారాయణపేటలో శుక్రవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక బహార్‌పేట నీలకంఠస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పార్టీ సభ్యత్వాన్ని ప్రారంభించి, మాట్లాడారు. పార్టీ సభ్యత్వం పొందిన వారికి రూ.ఐదు లక్షల ప్రమాద బీమా సౌకర్యంతో పాటు కార్యకర్తల కుటుంబంలో విద్యార్థుల చదువులకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, భీమన్న, నరసింహ, రాములు, శకుంతలమ్మ, అనంతమ్మ, లక్ష్మణ్, గోపాల్, తులసీదాస్ తదితరులున్నారు.

సీపీఎం జిల్లా మహాసభలు విజయవంతం చేయాలి



మాగనూరులో మహాసభ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

మాగనూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మక్తల్ నియోజకవర్గంలో ఈనెల 3, 4 తేదీల్లో నిర్వహించే సీపీఎం రెండవ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పుంజునూర్ అంజనేయులు, సీనియర్ నాయకుడు భరత్‌కుమార్‌లు కోరారు. శుక్రవారం మండల పరిధిలోని కొత్తపల్లి మాగనూరు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ప్రచారం చేశారు. మహాసభల్లో సీపీఎం మూడు సంవత్సరాల దిశా నిర్దేశాన్ని చేస్తాయని వారు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం కృషి చేద్దాం

కోస్గి నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ గంజాయి రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతీ ఒక్కరం కృషి చేద్దామని ఎస్సై బాలరాజు అన్నారు. శుక్రవారం కోస్గి పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రగ్స్ నిర్మూలన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ యువతను పట్టి పీడిస్తున్న డ్రగ్స్, గంజాయి మహమ్మారిని తరిమి కొడదామని, ఇందుకుగాను పోలీసులకు సహకరించాలని కోరారు. సీఐ దస్రునాయక్, ఎంఈవో శంకర్‌నాయక్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సామాన్యులకేదీ రక్షణ?

- విధుల్లో ఉన్న ఎస్‌బీ కానిస్టేబుల్‌పై దాడి చేసిన వారిపై చర్యలు కరువు

- పట్టించుకోని ఉన్నతాధికారులు

కోస్గి, నవంబరు 1 : (ఆంధ్రజ్యోతి): పోలీసులకే రక్షణ లేదాయే ఇక సామాన్యులకేదీ రక్షణ అన్న అనుమానం మండల ప్రజల్లో నెలకొంది. మూడురోజుల క్రితం ఓ ఎస్‌బీ కానిస్టేబుల్‌పై దాడి జరిగిందని కేసు నమోదు చేసిన పోలీసులు నేటికీ వారిని అరెస్ట్ చేయకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. తోటి పోలీస్‌పై దాడి జరిగినా సిబ్బంది చర్యలు తీసుకోకుండా తూతూ మంత్రంగా వారు అందుబాటులో లేరని చెప్పడంపై పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట్ మండల ఎస్‌బీ కానిస్టేబుల్ కృష్ణ విధి నిర్వహణలో భాగంగా వెళ్తున్న అతనిపై కొందరు మద్యం మత్తులో దాడి చేయగా కోస్గి పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనపై పోలీసులకు రాజకీయ ఒత్తిడా లేక ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయో తెలియదు కానీ దాడి చేసిన వారిని మాత్రం పట్టుకోవడం లేదు. ఓ పోలీసుపై దాడి చేస్తేనే పట్టుకోని పోలీసులు తమపై దాడి చేస్తే ఏంటని సామాన్యులు కొందరు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.